సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 29 । ఆగస్టు । 2023



ఆట.. ఉద్యోగాల బాట

క్రీడల్లో రాణిస్తున్న వారికి స్పోర్ట్స్ కోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని క్రీడా కోటాలో కొలువులు సాధించారు. 8లో▸



మత్తులో యువత

గంజాయి ఘాటు యువతను మత్తెక్కిస్తోంది. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం సరఫరా అవుతోంది. గత ఏడాది కాలంలో ఎనిమిది కేసులు నమోదయ్యాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /23.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా ఈదురుగాలులు వీస్తాయి. రాత్రివేళ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

బెల్లంపల్లిపై కామ్రేడ్ల ఆశలు



సోమవారం ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో చర్చిస్తున్న మాజీ మంత్రి వినోద్

- కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తుపై చర్చ
- గత ఎన్నికల్లో సీపీఐకి కేటాయింపు
- మరోసారి సీటు కోరుతున్న వైనం
- పొత్తు ఉండదంటున్న గడ్డం వినోద్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తు తెరపైకి రావడంతో బెల్లంపల్లి స్థానంపై చర్చ మొదలైంది. రాష్ట్రంలో సీపీఐ(కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా) ప్రభావం ఉన్న బెల్లంపల్లి స్థానం కోరడంపై స్థానిక కామ్రేడ్లలో ఆశలు రేకెత్తిస్తోంది. జిల్లాలో కోల్‌బెల్ట్, బెల్లంపల్లిలో ఇంకా కమ్యూనిస్టుల ప్రభావం ఉంది. ఎస్సీ రిజర్వు స్థానంగా ఉన్న ఈ నియోజకవర్గంలో దివంగత్ సీనియర్ నాయకుడు గుండా మల్లేశ్ ఉన్నంతకాలం పార్టీ బలంగా కొనసాగింది. నియోజకవర్గ పునర్విభజన తర్వాత ఆసిఫాబాద్ నుంచి వేరుపడ్డాక జరిగిన 2009 ఎన్నికల్లోనూ ఆయనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. చివరిసారిగా 2018 ఎన్నికల్లో మహాకూటమిలో భాగంగా మరోసారి సీపీఐకి కేటాయించారు. ఆ సమయంలో టీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడి, కాంగ్రెస్ నుంచి కూడా ప్రయత్నాలు చేసి విఫలమైన మాజీ మంత్రి గడ్డం వినోద్ బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేయడంతో సీన్ మారింది. అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు గట్టి పోటీ ఇచ్చారు. వినోద్ రెండో స్థానంలో నిలిచి పదివేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో సీపీఐకి ఆశించిన మేర ఓట్లు రాలేదు. స్వతంత్ర అభ్యర్థి కన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. తాజాగా మరోసారి పొత్తులు తెరపైకి వస్తున్న నేపథ్యంలో బెల్లంపల్లి సీటు రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

పొత్తు కుదిరేనా?

రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తు కుదిరితే వామపక్షాలు ప్రభావం చూపే సీట్లలో బెల్లంపల్లి ఇచ్చే అవకాశం ఉంటుందా? అనేది ఇప్పటికైతే స్పష్టత లేదు. కానీ ఇక్కడి నుంచి మరోమారు పోటీకి మాజీ మంత్రి వినోద్ సిద్ధంగా ఉన్నారు. గతంలో ఇక్కడ పోటీ చేసేందుకే టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధపడ్డారు. కానీ టికెట్ రాకపోవడంతో ఏనుగు పార్టీ వైపు వెళ్లారు. మళ్లీ కాంగ్రెస్‌లో చేరాక బెల్లంపల్లిలోనే పైనే దృష్టి కేంద్రీకరించారు. ఈ క్రమంలో తనకే సీటు ఖాయమని చెప్పుకుంటున్నారు. పార్టీలో వర్గాలు ఉండడంతో అనైక్యత ఉంది. మరోవైపు సీపీఐలో గుండా మల్లేశ్ మరణానంతరం ఆ స్థాయిలో ఎదిగిన నేత ఎవరూ లేరు. నియోజకవర్గంలో తమ పట్టు కోల్పోకుండా ఉండేందుకు పార్టీ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులను రంగంలోకి దింపింది. నస్పూర్ పట్టణ కౌన్సిలర్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న రేగుంట చంద్రశేఖర్ గత ఏడాది నుంచి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. జీపు యాత్ర కార్యక్రమాలతోపాటు ఇంటింటి ప్రచారం పేరుతో పర్యటిస్తున్నారు. పొత్తు కుదరకున్నా పోటీ చేసే ఆలోచనలో ఉన్నారు. కాంగ్రెస్‌తో కమ్యూనిస్టుల దోస్తీ కుదిరితే మంచిర్యాల, చెన్నూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న కోల్‌బెల్ట్ నుంచి కాంగ్రెస్ పార్టీకే మేలు జరగనుంది.

సీటుపై వినోద్ ధీమా..

బెల్లంపల్లి సీటు ఎట్టి పరిస్థితుల్లో సీపీఐకి కేటాయించే అవకాశమే లేదని మాజీ మంత్రి వినోద్ బలంగా నమ్ముతున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అనుచరులు ఆయనకే సీటు వస్తుందని అంటున్నారు. గత ఎన్నికల్లోనే కమ్యూనిస్టులు ప్రభావం కోల్పోయారని, ప్రస్తుతం వారి ప్రభావం ఉండదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పొత్తు తెరపైకి రావడంతో వినోద్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో ఈ సీటుపై చర్చించినట్లు తెలుస్తోంది. సోమవారం ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జీ మాణిక్‌రావు ఠాక్రేను కలసి కూడా ఈ విషయమై మాట్లాడారు. దీనిపై వినోద్ 'సాక్షి'తో మాట్లాడుతూ బెల్లంపల్లి సీటు తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నుంచి తమకే వస్తుందని, దీనిపై ఎటువంటి సందేహాలు లేవని స్పష్టం చేశారు.

గ్రేడ్.. పెరగనివ్వట్లే!

మంచిర్యాలకు చెందిన ఓ నిరుద్యోగి విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్‌గా ఏడాదిన్నర క్రితం లైసెన్స్ పొందాడు. అయితే ఆయన ఇప్పటివరకు తన పేరిట ఒకటంటే ఒక్క పని చేయలేకపోయాడు. జిల్లాలోని వివిధ సెక్షన్లలో కొంతమంది కాంట్రాక్టర్లు 20 ఏళ్ల నుంచి వారే పనులు చేస్తూ కొత్త వారిని దరిదాపులోనికి రానివ్వకపోవడమే కారణంగా తెలుస్తోంది. ఈ ఒక్క సర్కిల్‌లోనే కాదు.. ఉమ్మడి జిల్లాలోని మిగతా సర్కిల్ డివిజన్లలోనూ ఇదే పరిస్థితి.

- విద్యుత్‌శాఖలో కొత్త కాంట్రాక్టర్లపై ఉక్కుపాదం
- పనులు చేయకుండా అడ్డంకులు
- కమీషన్లకే అధికారుల మొగ్గు
- బడా గుత్తేదారులదే హవా



ఉట్నూర్ విద్యుత్ శాఖ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్: విద్యుత్ శాఖలో బడా కాంట్రాక్టర్ల హవా కొనసాగుతోంది. కొత్త కాంట్రాక్టర్లకు పనులు దక్కకుండా వీరు అధికారులతో 'మామూలు' గా వ్యవహరిస్తూ చక్రం తిప్పుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల పలుచోట్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం.

అనధికారికంగా టెండర్లు..?

విద్యుత్‌శాఖ పరంగా చేపట్టే వివిధ పనులను లైసెన్స్‌డ్ కాంట్రాక్టర్ల ద్వారా చేపడుతారు. ఈ క్రమంలో నిరుద్యోగులు వ్యయప్రయాసలకోర్చి తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు నుంచి లైసెన్స్ పొంది ప్రయోజకులుగా మారుదామన్న ప్రయత్నాలు అడియాశలవుతున్నాయి. బడా కాంట్రాక్టర్లు ఈ కొత్త గుత్తేదారులను ఎదగకుండా కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఇలాంటివే అనేకచోట్ల కనబడుతున్నా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గ్రేడ్ పెంచుకోవాలన్న కొత్త కాంట్రాక్టర్ల ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ప్రోత్సాహం అందించాల్సిన విద్యుత్ శాఖ అధికారులు పాత కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి వీరి ఎదుగుదలను అడ్డుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఆదిలాబాద్‌లో ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు సంబంధించి విద్యుత్ పనులు చేపట్టే విషయంలో ఇద్దరు కాంట్రాక్టర్ల మధ్య తలెత్తిన వివాదం అసలు ఆ వర్క్‌కు టెండర్లే చేపట్టకుండా అనధికారికంగా నిర్వహిస్తున్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో విద్యుత్‌శాఖలో టెండర్ల బాగోతం కొండంత ఉందన్న విమర్శలు ఉన్నాయి.

ఇదీ పరిస్థితి..

విద్యుత్‌శాఖ పరంగా చేపట్టే పనులను కాంట్రాక్టర్లకు టెండర్ల ద్వారా అప్పగిస్తారు. ప్రధానంగా బోర్డులో లైసెన్సు పొందిన కొత్త కాంట్రాక్టర్‌కు గ్రేడ్–3 కింద రూ.రెండున్నర లక్షల లోపు పనులు అప్పగిస్తారు. ఈ పనులు అనేకం చేపట్టి ఏడాదికి రూ.20లక్షల పైబడి పూర్తి చేస్తే తదుపరి.. బోర్డు నుంచి వారిని గ్రేడ్–2కు గాని, గ్రేడ్–1కి గాని పెంచేందుకు దోహదపడుతుంది. ఈ గ్రేడ్ పెరిగినప్పుడు కొత్త కాంట్రాక్టర్లు రూ.10లక్షలు, రూ.20లక్షలు, ఆపైబడి పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది. అయితే పాత కాంట్రాక్టర్లు కొత్త గుత్తేదారులకు పనులు దక్కకుండా చేయడంతో మంచిర్యాల, కాగజ్‌నగర్, ఉట్నూర్‌లో పరిస్థితి తీవ్రంగా ఉండగా, ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మిగతా డివిజన్లలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి.

చిన్న పనులు మాయం..

విద్యుత్ శాఖలో చిన్న పనులకు సంబంధించిన ప్యాకేజీలు మాయం అవుతున్నాయన్న విమర్శలున్నాయి. దీని వెనుక బడా కాంట్రాక్టర్ల కుయుక్తులు ఉండగా, విద్యుత్ శాఖలోని ఉన్నతాధికారులు వారికి వంతు పాడుతున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు.. రూ.2లక్షల వర్క్‌కు సంబంధించి టెండర్ల ద్వారా కొత్త కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలి. అయితే ఇలాంటి చిన్న పనులను ఏదైనా పెద్ద ప్యాకేజీలో కలిపేసి బడా కాంట్రాక్టర్లకే దక్కేలా అధికారులు తోడ్పాటునందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి పలు డివిజన్లలో ఉందని పలువురు బాహాటంగానే చెబుతున్నారు.

ఎక్సెస్‌లో పనులు..

సాధారణంగా కాంట్రాక్టర్ల మధ్య పోటీ ఉన్నప్పుడు ఆ వర్క్స్‌ను దక్కించుకునేందుకు అంచనా వ్యయం కంటే తక్కువలోనే తాము పూర్తి చేస్తామని కొంతమంది కాంట్రాక్టర్లు లెస్‌కే వర్కులను దక్కించుకుంటారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు విద్యుత్ శాఖ డివిజన్‌లలో 5 శాతం ఎక్సెస్‌తో కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంలో అధికారుల స్వార్థ ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎక్సెస్ నిధులను ఉన్నతాధికారులకు కాంట్రాక్టర్లు కమీషన్‌గా ఇవ్వడం ద్వారా పరస్పర ప్రయోజనాలు పొందుతున్నారు. విద్యుత్ శాఖలో జరుగుతున్న ఈ తతంగాలపై ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఈ విషయంలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డీఈ సుభాష్‌ను 'సాక్షి' వివరణ కోరేందుకు ఫోన్‌లో యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

104 కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రంతో 104 ఉద్యోగులు

నస్పూర్: జిల్లాలోని 104 కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తెలిపారు. నాయకులు ఉద్యోగులతో కలిసి సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15ఏళ్లుగా ఎలాంటి భద్రత లేకుండా చాలీచాలని జీతాలతో 1,350 మంది విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, వేతనాలను ట్రెజరీల ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కే.శ్రీనివాస్, కే.రాజయ్య, పోచం, ఎం.స్వప్న, రమాదేవి, సునీత, ద్వామిని, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: మీ సేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మీ సేవా జాయింట్ యాక్షన్ కమిటీ(జాక్) నాయకులు తెలిపారు. సోమవారం నాయకులు నిర్వాహకులతో కలిసి కలెక్టర్ సంతోష్, నస్పూర్ తహసీల్దార్ డీటీ శ్రావణికి వినతిపత్రం అందజేశారు. మీ సేవలో తొలగించిన పహాణీలను పునరుద్ధరించాలని, కమీషన్లు పెంచాలని, ఉచిత విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీ సేవా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, నిర్వాహకులు సాయిని తిరుపతి, జంగెటి రవీందర్, కాంపెల్లి శ్రావణ్, మద్దె చేరాలు, నరేందర్, ప్రసాద్, సతీష్, రవీందర్, ప్రవీణ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్: పట్టణ పరిధిలోని 4వ వార్డులో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని కౌన్సిలర్ బెడిక లక్ష్మి తెలిపారు. గతంలో అనేకమార్లు కమిషనర్, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సంపత్

చెన్నూర్: చెన్నూర్ కోర్ట్ పరిధిలోని కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని స్థానిక జడ్జి సంపత్ అన్నారు. కోర్ట్ ఆవరణలో సోమవారం జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి కోర్టు పరిధిలోని ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పోలీసుస్టేషన్ల వారీగా రాజీ పడే కేసులు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసుల రాజీ కోసం కోర్టు పోలీసులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో చెన్నూర్, కోటపల్లి ఎస్సైలు వెంకటేశ్వర్, సురేశ్, కోర్టు పోలీసులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి స్టేషన్ నుంచి మూడు రైళ్ల రాకపోకలు

బెల్లంపల్లి: మూడో రైల్వేలైన్ మరమ్మతుల దృష్ట్యా హైదరాబాద్–బల్లార్షా మధ్య రాకపోకలు సాగించే మూడు రైళ్లను బెల్లంపల్లి నుంచి నడపడానికి రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. బెల్లంపల్లి–కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్య మూడో రైల్వేలైన్ పనులు ప్రస్తుతం సాగుతున్నాయి. ఈ కారణంగా భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను అప్, డౌన్ మార్గాల్లో బెల్లంపల్లి రైల్వేస్టేషన్ వరకే పరిమితం చేసినట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. సెప్టెంబర్ 9వరకు ఆయా రైళ్లు బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తాయి. ఈ మేరకు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.


బాలుర ఉన్నత పాఠశాలలో వృక్షాబంధన్



చెట్లకు రాఖీ కడుతున్న టీచర్లు, విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో వృ(ర)క్షా బంధన్ ఆలోచింపజేసింది. సోమవారం విద్యాశాఖ ఆదేశానుసారం రాఖీపౌర్ణమి సందర్భంగా పాఠశాలలో చెట్లకు పర్యావరణ మిత్ర పదార్థాలతో చేసిన రాఖీలు కట్టారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు వృ(ర)క్షాబంధన్ చేయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రాఖీ ఆకారంలో నిల్చుని ప్రతిజ్ఞ చేశారు. రాఖీలను కట్టిన చెట్లను ఆత్మీయంగా అలింగనం చేసుకున్నారు. సేవ్ ట్రీ అంటూ సందేశాత్మకంగా చేసిన పలు రాఖీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రీన్‌కోర్ కో–ఆర్డినేటర్ యోగేశ్వర్, హెచ్‌ఎం దుర్గయ్య, గ్రీన్‌టీచర్ శ్రీనివాసవర్మ, ఉపాధ్యాయులు వేణు, గోపాల్, నీల్‌కమల్, రేణిరాజయ్య, భాగ్యలక్ష్మీ, రంగరాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులు బిల్లులు తీసుకోవాలి



పత్తిచేనును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

కాసిపేట: రైతులు ఫర్టిలైజర్ షాపుల వద్ద కొనుగోలు చేసే యూరియా, ఎరువులు, మందులకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన సూచించారు. సోమవారం మండలంలోని ముత్యంపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. వానాకాలం పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన చర్యలు, పంటల సస్యరక్షణ చర్యలపై వివరించారు. పీఎస్సీ వాడకంపై అవగాహన కల్పించారు. ముత్యంపల్లిలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసి ఎరువులు అధిక ధరలకు అమ్మకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దేవులపల్లి వందన, ఏఈవో రమ్య, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సర్వే

దండేపల్లి: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా మండలంలో ఎంపికైన దుబ్బగూడ (ఎల్), రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలలను ఛాత్రోపాధ్యాయులు సోమవారం సందర్శించారు. మూడు రోజుల సర్వేలో భాగంగా మొదటి రోజు విద్యార్థులకు తెలుగు పరీక్ష నిర్వహించి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రతిభ సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాల హెచ్‌ఎం వసంత, సీఆర్పీ సురేందర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

నస్పూర్: ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో దాదాపు 60 దరఖాస్తులు అందాయని, వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

- జిల్లాలో ఏళ్లుగా పని చేస్తున్న 2వ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలని గత 13 రోజులుగా ఆందోళన చేస్తున్నామని తాము అందిస్తున్న సేవలను గుర్తించి తమను క్రమబద్ధీకరించాలని ఏఎన్‌ఎంలు మంజుల, తులసి, పద్మ, సత్యవతి, తిరుమల కోరారు.
- తమ ఇంటి ప్రహరీని పగులగొట్టి డ్రెయినేజీ పైపులైన్ వేశారని, ఆ పైపులైన్ తీయించి వారిపై చర్యలు తీసుకోవాలని నస్పూర్‌లోని శ్యాంనగర్‌కు చెందిన రాజేశ్వరి ఫిర్యాదు చేశారు.

పింఛన్ ఇప్పించండి



నేను శ్రీరాంపూర్ కొత్తరోడ్‌లో ఉంటాను. నాకు కాళ్లు, కళ్లు, చేతులు సరిగా పనిచేయడం లేదు. నాకు ఇప్పటివరకు పింఛన్ రావడం లేదు. నాకు వికలాంగుల పింఛన్ ఇప్పించండి.

– ఐలయ్య, నస్పూర్

ప్రమాదంలో కాలు పోయింది..



నేను మందమర్రిలో ఉంటాను. నాకు మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు సగం వరకు పూర్తిగా తెగిపోయింది. ప్రస్తుతం కృత్రిమ కాలుతో నడుస్తున్నాను. వికలాంగుల సర్టిఫికేట్ ఉన్నది. వికలాంగుల పింఛన్ ఇప్పించగలరు.

– ముక్కెర నది, మందమర్రి

వీల్‌చైర్ ఇప్పించరూ..



నాకు రెండు కాళ్లు సరిగా పని చేయవు. వికలాంగుల పింఛన్ వస్తుంది. ఎక్కడైనా వెళ్లాలంటే ఇబ్బంది అవుతుంది. వీల్‌చైర్ ఇప్పించండి.

– జిమ్మిడి పోషం, గ్రామం: పారుపల్లి, మం: కోటపల్లి

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి..



మేము దుబ్బగూడెం వాసులం. మా ఇళ్లు కల్యాణ్‌ఖని మందమర్రి ఓపెన్ కాస్టులో ముంపునకు గురవుతున్నాయి. సోషల్ ఎకానమీ సర్వే డిక్లరేషన్‌లో మా ఇళ్లను చేర్చినట్లు ఇచ్చారు తర్వాత తొలగించారు. మా ఇళ్లను పీడీఎఫ్ జాబితాలో చేర్చి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించి ప్లాట్లు ఇప్పించాలని పులి వెంకటస్వామి, ఎన్నమల్ల నర్సయ్య, రమేశ్, బెడ్డాల పోషం, రామటెంకి భానయ్య కోరారు.

డీఎస్సీ పోస్టుల సంఖ్య పెంచాలి



రాష్ట్ర ప్రభుత్వం 5000 టీచర్ పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేస్తోంది. ఖాళీగా ఉన్న మొత్తం 13,500 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డీఎస్సీ అభ్యర్థులు కే.రమేశ్, సురేశ్, మహేశ్, నారాయణ, రాజేశ్, అరుణ, స్నేహ, శ్రీకన్య, అక్షర, మౌనిక, తదితరులు వినతిపత్రం సమర్పించారు.

సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



పాల్గొన్న కలెక్టర్ సంతోష్, అధికారులు

నస్పూర్: పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలుపై ప్రతేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం ఆమె హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వివిధ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలని, ఎవరైనా పింఛన్‌దారు మృతిచెందితే సంబంధిత వ్యక్తి భార్యకు పింఛన్ అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిశీలించి అర్హుల జాబితాను ఆమోదం కోసం పంపించాలని ఆదేశించారు. నోటరైజ్డ్ స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీఓ 84 విడుదల చేసిందని, దరఖాస్తులు స్వీకరించి విచారణ జరిపి క్రమబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ గృహలక్ష్మి పథకానికి జిల్లాలో 50,051 దరఖాస్తులు వచ్చాయని, జీఓ 59 కింద భూముల క్రమబద్ధీకరణకు అర్హుల నుంచి ప్రభుత్వ రుసుం వసూలు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సబావత్ మోతీలాల్, బి.రాహుల్, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే ఓటేస్తామని తీర్మానం



చెన్నూర్: సమావేశంలో నాయీ బ్రాహ్మణులు

చెన్నూర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కే ఓటు వేస్తామని నాయీ బ్రాహ్మణులు తీర్మానం చేశారు. సోమవారం స్థానికంగా సమావేశమై ప్రభుత్వ పరంగా నాయీ బ్రాహ్మణులకు న్యాయం జరిగిందని, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చెన్నూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వచ్చిన మెజార్టీ కంటే రెట్టింపు మెజార్టీతో గెలుపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు మామిడి పోచం, పట్టణ అధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు బాపు, కోశాధికారి శ్రీరాములు, అశోక్ పాల్గొన్నారు.

అందుగులపేటలో గ్రామస్తులు..

మందమర్రిరూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని మండలంలోని అందుగలపేట గ్రామస్తులు తీర్మానం చేశారు. సోమవారం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులంతా సమావేశమై గ్రామంలో జరిగిన అభివృద్ధిపై చర్చించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, విప్ బాల్క సుమన్ రాళ్ల వాగుపై వంతెన నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించారని సంతోషం వ్యక్తం చేశారు.

పంచాయతీ కార్మికులకు బీమా

- అంత్యక్రియలకు రూ.10 వేల సాయం
- జిల్లాలో 1,089 కార్మికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని 310 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1089 మందికి ఎల్ఐసీ ద్వారా బీమా అమలుకు ఉత్తర్వులు జారీ చేసింది. బీమా ప్రీమియంకు అవసరమయ్యే నిధులను గ్రామ పంచాయతీలు చెల్లించాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. ప్రీమియం చెల్లింపుతోపాటు క్లెయిమ్ పర్యవేక్షణ డీపీఓలకు అప్పగించింది. కార్మికుడు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందుతుంది. కార్మికులు ఎవరైనా మరణిస్తే గతంలో అత్యవసర ఖర్చుల(అంత్యక్రియలు) కోసం ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.5 వేలు అందించేది. ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ.10 వేలకు పెంచి తక్షణ సహాయం అందజేస్తుంది. బీమా ప్రీమియం పంచాయతీలు చెల్లిస్తాయని డీపీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

క్లుప్తంగా

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎస్సీఓస్ కాలనీలో దేశీదారు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బందితో కలిసి కాలనీలో జరిపిన దాడుల్లో స్కార్పియో వాహనంలో ఉన్న 30 దేశీదారు కాటన్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా.. మహారాష్ట్రకు చెందిన సచిన్ రాజ్ అడ్లకొండవార్, సుగత్ సంజయ్ రాయపూరి కాగజ్‌నగర్‌లోని తీరం దాస్‌బస్తీకి చెందిన జాడి శ్రీకాంత్‌కు కొంత కాలంగా దేశీదారు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం శ్రీకాంత్ పరారీలో ఉన్నాడు. దేశీదారు బాటిళ్లతో పాటు వాహనం స్వాధీనం చేసుకుని కాగజ్‌నగర్‌రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య



లెజమ్‌సింగ్ మృతదేహం

బెల్లంపల్లి: పట్టణంలోని గంగారాంనగర్ బస్తీలో నివాసం ఉంటున్న ఓ చిరు వ్యాపారి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని కన్నాపూర బంజారా గ్రామానికి చెందిన లెజమ్‌సింగ్ (41) ఐదేళ్ల క్రితం బెల్లంపల్లికి వలస వచ్చాడు. గంగారాంనగర్ బస్తీలో నివాసం ఉంటూ చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి బట్టలు విక్రయిస్తుండేవాడు. ఈక్రమంలో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రి ముందు ఉన్న రైలు పట్టాల వద్దకు వెళ్లి గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అతని కుమారుడు రోహిత్‌కు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ఘటనస్థలంలో మృతదేహం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు (55)టీవీఎస్ చాంప్‌పై వెళ్తుండగా వాంకిడి నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని సెల్‌ఫోన్ ఆధారంగా కాగజ్‌నగర్ మండలం మానిక్‌పటార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సీఐ సురేశ్ తెలిపారు.

ఆట.. ఉద్యోగాల బాట

- క్రీడల్లో మెరిశారు... కొలువులు కొట్టారు
- జిల్లా, దేశానికి కీర్తి తీసుకువస్తున్న క్రీడాకారులు


క్రీడల్లో రాణిస్తున్న వారికి స్పోర్ట్స్ కోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకున్న జిల్లా క్రీడాకారులు ఆటల్లో రాణించి.. క్రీడా కోటాలో కొలువులు సాధించారు. ఉద్యోగాలు చేస్తూనే జాతీయస్థాయిలో తమకు నైపుణ్యం ఉన్న క్రీడల్లో రాణిస్తున్నారు. పతకాలు సాధిస్తూ జిల్లాకు, తాము పనిచేస్తున్న శాఖకు, దేశానికి కీర్తి తెస్తున్నారు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉద్యోగ క్రీడాకారులపై కథనం.

– మంచిర్యాలటౌన్



బాస్కెట్‌బాల్ ఆడుతున్న సుజిత్‌రెడ్డి

సౌత్ సెంట్రల్ రైల్వేలో కొలువు



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ ప్రాంతానికి చెందిన ఎల్.సుజిత్‌రెడ్డి మూడేళ్లపాటు కరీంనగర్ అకాడమీలో ఉంటూ బాస్కెట్‌బాల్‌లో ప్రావీణ్యం పొందాడు. 15 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. 2010లో సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం రైల్వేలోనే ట్రావెలిన్ టికెట్ ఇన్స్‌పెక్టర్ (టీటీఐ)గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

– ఎల్.సుజిత్‌రెడ్డి, బాస్కెట్‌బాల్ ప్లేయర్, రైల్వే ఉద్యోగి, మంచిర్యాల

వాలీబాల్ ప్లేయర్ రైల్వే ఉద్యోగి



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీకి చెందిన బిల్లా ఆనంద్ కుమార్ హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం స్పోర్ట్స్ హాస్టల్‌లో ఉండి వాలీబాల్ ప్లేయర్‌గా ఉన్నత స్థాయికి ఎదిగాడు. మూడుసార్లు ఇండియాకు రిప్రజెంటర్‌గా ఆడి విజేతగా నిలిచాడు. 12 సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించాడు. స్పోర్ట్స్ కోటాలో సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో చీఫ్ టికెట్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూనే పలు చిత్రాల్లో యాక్టర్‌గా చేస్తున్నాడు.

– బిల్లా ఆనంద్ కుమార్, వాలీబాల్ ప్లేయర్, రైల్వే ఉద్యోగి, మంచిర్యాల

డీఆర్డీవోలో కొలువు..



రామకృష్ణాపూర్‌కు చెందిన నాగరాజు ఎల్‌బీ స్టేడియంలోని స్పోర్ట్స్ హాస్టల్‌లో ఉంటూ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రాణించాడు. 11 నేషనల్స్ ఆడి సత్తా చాటారు. సంతోష్ ట్రోఫీ, జూనియర్, సీనియర్ నేషనల్స్, స్కూల్ నేషనల్స్ లోనూ విజేతగా నిలిచారు. స్పోర్ట్స్ కోటాలో డీఆర్డీవో డిపార్టుమెంట్‌లో డీఎంఆర్‌ఎల్‌లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం సాధించాడు.

– నాగరాజు, డీఆర్డీవో డిపార్టుమెంట్ డీఎంఆర్‌ఎల్, రామకృష్ణాపూర్

ఫుట్‌బాల్‌లో రాణించి..



రామకృష్ణాపూర్‌కు చెందిన శోభన్ హైదరాబాద్‌లోని హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతూ ఫుట్‌బాల్‌లో రాణించాడు. కర్నూలులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్‌లో ఉంటూ 12 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచాడు. ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వేలో గ్రూప్ 3 ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

– శోభన్, ఫుట్‌బాల్ ప్లేయర్, సౌత్ సెంట్రల్ రైల్వే ఉద్యోగి, రామకృష్ణాపూర్

'మాస్టర్ ఇన్ స్పోర్ట్స్' చేస్తున్న బాలకృష్ణ



చెన్నూర్: పట్టణంలోని పుష్పాల హనుమాన్ వీధికి చెందిన జనగామ బాలకృష్ణ ఏడో తరగతి నుంచి పదోతరగతి వరకు తిరుపతిలోని స్పోర్ట్స్ పాఠశాలలో చదివాడు. కాకతీయ యూనివర్శిటీలో బీపెడ్ పూర్తి చేశాడు. ఎంఎంఆర్ కళాశాల చౌటుప్పల్‌లో ఎంపీఈడీ, కోల్‌కత్తాలో ఎన్ఐఎస్ఐఎస్ డిప్లొమా పూర్తి చేశాడు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించాడు. 2023లో పంజాబ్‌లోని పాటియాలలో మాస్టర్ ఇన్ స్పోర్ట్స్ (ఎంఎస్‌సీ) చేస్తున్నాడు. ఈ కోర్సు పూర్తిచేస్తే జాతీయ జట్లకు కోచ్‌గా వ్యవహరించే అవకాశం లభిస్తుంది. తెలంగాణ రాష్ట్రం నుంచి మాస్టర్ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్ కోర్సు చేస్తున్నది కేవలం బాలకృష్ణ కావడం జిల్లాకే గర్వకారణం.

– బాలకృష్ణ, చెన్నూర్, మంచిర్యాల

చిందు కళాకారునికి నటభూషణ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రామచంద్రు

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన చిందుయక్షగాన కళాకారుడు గడ్డం రామచంద్రు నటభూషణ్ అవార్డు అందుకున్నారు. ఇటీవల వరంగల్ జిల్లాలో నిర్వహించిన ప్రపంచ జానపద దినోత్సవ కార్యక్రమంలో వరంగల్ కార్పొరేటర్ అనిల్, సకల కళా సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సర్పంచ్ అక్కల మధుకర్, నాయకులు సల్పాల పొచన్న, రమేశ్, గ్రామపెద్దలు అభినందించారు.

నూతన నియామకం



వీరభద్రయ్య



ముస్కే సమ్మయ్య

పాతమంచిర్యాల: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రెటరీలుగా కే.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య నియామకమయ్యారు. రామగుండం–1 ఏరియాలో జరిగిన ఏఐటీయూసీ మహాసభల్లో వీరిని నియమించినట్లు యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రకటించారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన



రాజయ్య (ఫైల్)



ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

నస్పూర్(మంచిర్యాల): మే 8న శ్రీరాంపూర్ ఓసీపై గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సింగాపూర్‌కు చెందిన అట్కపురం రాజయ్య(45) శ్రీరాంపూర్ ఓసీలోని ఓబీ మట్టిని వెలికి తీసే సీఆర్‌ఆర్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నాడు. మే 8న ఉదయం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో సాండ్ బంకర్ చెక్ పోస్టు వద్ద ఉన్న గార్డు ఒక్కసారిగా గేటును కిందకు దింపాడు. గేటు కింది నుంచి వెళ్లడానికి యత్నించిన రాజయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలిసి స్థానికులు ఓసీపై ఆందోళన నిర్వహించారు. వాహనాలను అడ్డుకుని పీఓ కార్యాలయం ముట్టడికి యత్నించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, సింగాపూర్ మాజీ సర్పంచ్ రాజేంద్రపాణి వారికి మద్దతు తెలిపారు.

'చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చెన్నూర్: చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాలుగేళ్లు దాటినా నేటికీ డివిజన్ కాలేదన్నారు. రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, అస్నాద్‌లను మండలాలుగా ఏర్పాటు చేస్తామని విప్ ప్రకటించారన్నారు. సమావేశంలో నాయకులు సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, శివ, గడిపల్లి సంతోశ్, కోరకొప్పుల వంశీ పాల్గొన్నారు.

ఐటీఐలో సోలార్ టెక్నీషియన్ కోర్సు

మంచిర్యాలఅర్బన్: ఐటీఐలో ఏటా కొత్తకోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో గతేడాది ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ కోర్సు ప్రవేశపెట్టగా ఈఏడాది నుంచి సోలార్ టెక్నీషియన్ (ఎలక్ట్రికల్) కోర్సుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. సోలార్ టెక్నీషియన్ కోర్సులో 40 సీట్లు, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ కోర్సులో 31 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చందర్ సూచించారు.

మహబూబాబాద్ ఎస్పీగా మందమర్రి వాసి



చంద్రమోహన్

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పట్టణానికి చెందిన గుండేటి చంద్రమోహన్‌ను మహబూబాబాద్ ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2012లో గ్రూప్–1 అధికారిగా పోలీస్‌శాఖలో చేరారు. మొదట నల్లగొండ జిల్లాలో దేవకొండ డీఎస్పీగా, కరీంనగర్ ఇంటలిజెన్స్ డీఎస్పీగా, కరీంనగర్ అడిషనల్ డీసీపీ అడ్మిన్‌గా విధులు నిర్వర్తించారు. ఇటీవల నాన్‌క్యాడర్ ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న జీఎం

నస్పూర్: సింగరేణి ఉద్యోగులకు మౌలిక వసతులు కల్పించేందుకు యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. కృష్ణాకాలనీలో ఆధునీకరించిన కమ్యూనిటీ హాల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్‌ను రూ.20 లక్షలతో ఆధునీకరించామన్నారు. నస్పూర్ కాలనీలో త్వరలో మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ జీఎం సూర్యనారాయణరెడ్డి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి, ఏరియా ఇన్‌చార్జి ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ ఏజీఎం సివిల్ నవీన్, డీజీఎం సివిల్ శివరావు, అధికారులు రాము, గుండెరావు పాల్గొన్నారు.

నూతన పంపును ప్రారంభించిన జీఎం

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి గోదావరి నది వద్ద గల ఇంటెక్‌వెల్‌లో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన 190 హెచ్‌పీ మోటార్‌ను జీఎం సంజీవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఇంటెక్ వెల్ నుండి రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్స్ వరకు ఏర్పాటు చేసిన నూతన పైపులైన్ ట్రయల్ రన్ చేశారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక ఇబ్బందులు



తల్లిదండ్రులతో సంధ్యారాణి

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని ఆలుగామ గ్రామానికి చెందిన బెడ్డల సంధ్యారాణి వైద్య విద్య కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గ్రామానికి చెందిన బెడ్డల బాపు కూతురు సంధ్యారాణి మెడికల్ విభాగంలో హైదరాబాద్‌లోని కళాశాలలో సీటు సాధించింది. అడ్మిషన్ పొందడానికి మరో వారం రోజుల సమయం మాత్రమే ఉంది. కనీసం రవాణా చార్జీలు కూడా లేవని వాపోయింది. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తీవ్ర ఆవేదన చెందుతోంది. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆర్థికసాయం అందిస్తే చదువుకుంటానని వేడుకుంటోంది.

'నేటి ధర్నా విజయవంతం చేయాలి'

నస్పూర్: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం పిలుపునిచ్చారు. సోమవారం శ్రీరాంపూర్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కోడ్‌లుగా కుదించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రామన్న, కిరణ్, పున్నం కుమార్, సంతోష్, శంకర్, గంగన్న, శ్యామ్ రాజేష్, రాజేశ్వరి, హంస, మేరీ, లక్ష్మి, పరిజన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మానందం

మత్తులో యువత..!

- మహారాష్ట్ర నుంచి రవాణా అవుతున్న గంజాయి
- ఆకర్షితులవుతున్న యువకులు, విద్యార్థులు
- ఏడాదికాలంలో 8 కేసులు నమోదు
- మూడు కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి (ఫైల్)

బెల్లంపల్లి: గంజాయి ఘాటు బెల్లంపల్లిని మత్తెక్కిస్తోంది. మహారాష్ట్ర నుంచి నిత్యకృత్యంగా గంజాయి సరఫరా అవుతుండడంతో ఎక్కడ చూసినా వాసన గుప్పుమంటోంది. తేలికగా డబ్బులు సంపాదించాలన్న దురాలోచనతో కొందరు మహారాష్ట్రలోని బల్లార్షా, చంద్రపూర్, తదితర ప్రాంతాల నుంచి కిలోలకొద్దీ గంజాయిని రైలుమార్గం ద్వారా తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల బెల్లంపల్లికి చెందిన బాల్మీకి అనుదీప్ అనే యువకుడు రైల్వేస్టేషన్ ఆవరణలో గంజాయితో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. మహారాష్ట్రలో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ అధిక ధరకు అమ్ముతుంటానని నిందితుడు బాహాటంగానే చెప్పడంతో పోలీసులు విస్తుపోయారు. ఇంకా అనేకమంది యువకులు ఇదేబాటను అనుసరిస్తున్నట్లు తెలిసింది.

నిర్మానుష్య ప్రాంతాలన్నీ అడ్డాలే...

పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నిర్మానుష్య ప్రాంతాలు, చెట్ల పొదలు, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, శిథిలావస్థకు చేరిన క్వార్టర్లు, పోచమ్మ చెరువుకట్ట, రైల్వే స్టేషన్ ఏరియా తదితర ప్రాంతాలు అడ్డాలుగా మారినట్లు తెలుస్తోంది. వీటితో పాటు పలు గ్రామాలు కూడా గంజాయి దమ్ముకు ప్రధాన స్థావరాలుగా మారినట్లు తెలుస్తోంది. ఎవరికీ అనుమానం రాకుండా సిగరెట్‌లో గంజాయి పొడిని నింపి దమ్ము లాగించేస్తున్నారు.

మత్తులో యువకులు

యువకులు మత్తులో జోగుతున్నారు. విద్యాభ్యాసం చేసే వయస్సులోనే గంజాయికి బానిస అవుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీధి రౌడీల అవతారం ఎత్తుతున్నారు. మత్తులో ఎంతకైనా తెగించడానికి సిద్ధపడుతున్నారు. తల్లిదండ్రులు కన్న కలలను కల్లలు చేసి బలాదూర్‌గా తిరుగుతున్నారు. బెల్లంపల్లి, తాండూర్, సోమగూడెం పారిశ్రామిక ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల యువకులుసైతం దురలవాటుకు ఆకర్శితులవుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

కట్టడి చర్యలు కరువు...

గంజాయి వల్ల అనేక దుష్ప్రభావాలు ఉండగా నియంత్రణ చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. మహారాష్ట్ర నుండి జరుగుతున్న గంజాయి రవాణాపై అధికారులు సరిగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జీఆర్పీ పోలీసులు రైళ్లలో సోదాలు చేయక పోవడంతో యువకులు దర్జాగా గంజాయిని తెచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతాల్లో సివిల్ పోలీసుల సంచారం గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో యువత గంజాయికి అలవాటుపడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఏడాదికాలంలో అడపా దడపా చేసిన తనిఖీల్లో బెల్లంపల్లిలో 6, తాండూర్‌లో 2 కేసులు నమోదయ్యాయి. అదే రెగ్యులర్‌గా నిఘా పెట్టి తనిఖీలు చేపడితే గంజాయిని నియంత్రించే అవకాశాలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు.

పట్టుబడితే కఠిన చర్యలు



గంజాయితో పట్టుబడితే ఎవరినీ ఉపేక్షించేది లేదు. నియంత్రణ కోసం తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల రోజువారీగా పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. నిఘా వ్యవస్థను అప్రమత్తం చేసి గంజాయి రవాణా చేస్తున్న యువకులపై ఓ కన్నేసి ఉంచాం. ఎవరైనా గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పంతాటి సదయ్య, ఏసీపీ, బెల్లంపల్లి

132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



రిలే దీక్షలో పాల్గొన్న నాయకులు

జన్నారం(ఖానాపూర్): మండల కేంద్రంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి మండల వాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు నేతకాని మహర్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకుడు రవి, సీపీఎం కన్వీనర్ విజయ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సమస్యతో ట్రాన్స్‌ఫార్మలు, మోటార్లు కాలిపోయి రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సబ్‌స్టేషన్‌పై హామి ఇచ్చే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు.

ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

- ప్రియుడు మృతి.. ప్రియురాలి పరిస్థితి విషమం



సోమేశ్వర్ మృతదేహం

తిర్యాణి(ఆసిఫాబాద్): ఆ ప్రేమికులు కలకాలం కలిసి జీవిద్దాం అనుకున్నారు.. ఏమైందో తెలియదు ప్రియుడికి గతేడాది మరో అమ్మాయితో వివాహమైంది. అయినా వారు ఒకరినొకరు మరువలేకపోయారు. కలిసి బతకలేమని.. కలిసి ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకుని అటవీ ప్రాంతానికి వెళ్లి పురుగుల మందు తాగారు. ప్రియుడు అక్కడికక్కడే మృతిచెందగా .. ప్రియురాలి పరిస్థితి విషమంగా ఉంది. కుమురంభీం జిల్లాలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై చుంచు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణి మండలం మాణిక్యపూర్‌కు చెందిన వల్క సోమేశ్వర్ (23), మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం సోనాపూర్‌కు చెందిన గంగోత్రి(20) కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అనుకోని కారణాలతో గతేడాది వేరే యువతితో సోమేశ్వర్‌కు వివాహమైంది. ఇటీవల కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనానికి పూజ చేయిస్తానని సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. ఉదయం 9 గంటలకు తన తమ్ముడు రాంప్రసాద్‌కు ఫోన్ చేసి బైక్, ఫోన్‌ను తీసుకెళ్లాలని వాట్సాప్‌లో లోకేషన్ పంపించాడు. తిర్యాణి మండలం ఎదులపహాడ్ శివారులో రాంప్రసాద్‌కు చలనం లేకుండా పడి ఉన్న సోమేశ్వర్, గంగోత్రి కనిపించారు. పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు సోమేశ్వర్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గంగోత్రి పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాల జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లి సోంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.